

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 25.0



ఓటుకు దూరంగా..

2,56,256

జిల్లాలో ఓటేయని వారి సంఖ్య..

భీమవరం టౌన్, మే 20 : సార్వత్రిక ఎన్నికల్లో ఈసారి చాలాచోట్ల భారీగానే పోలింగ్ నమోదైంది. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోలేనివారి సంఖ్య కూడా రెండు లక్షలకు పైగానే ఉంది. ఈ ఎన్నికల్లో 2 లక్షల 56 వేల 256 మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. జిల్లాలో 14 లక్షల 72 వేల 923 మంది ఓటర్లు ఉండగా 13న జరిగిన పోలింగ్‌లో 12 లక్షల 16 వేల 667 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాల వారీగా చూస్తే ఆచంట నియోజకవర్గంలో 1,80,017 మంది ఓటర్లు ఉండగా 1,49,048 ఓటు వినియోగించుకున్నారు. 30,699 మంది ఓటు వేయలేదు. పాలకొల్లులో 1,95,057మంది ఓటర్లు ఉండగా 1,60,489 మంది ఓటు వేయగా 34,568 మంది ఓటు వినియోగించుకోలేదు. నరసాపురంలో 1,70,448 మంది ఓటర్లు ఉండగా 1,43,825 మంది వినియోగించుకోగా 26,623 మంది ఓటు వేయలేదు. భీమవరంలో 2,53,116 మంది ఓటర్లు ఉండగా 2,00,857 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.52,259 మంది ఓటుహక్కు వినియోగించుకోలేదు. ఉండిలో 2,24,725 మంది ఓటర్లు ఉండగా, 1,93,722 మంది ఓటు వేయగా 31,003 మంది వేయలేకపోయారు. తణుకులో 2,34,575 మంది ఓటర్లు ఉండగా 1,92,736 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 41,839 మంది వేయలేదు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 2,14,985 మంది ఓటర్లు ఉండగా 1,75,990 మంది ఓటేయగా 38,995 మంది ఓటుహక్కు వినియోగించుకోలేకపోయారు. భీమవరంలో అధికంగా 52,259 మంది ఓటు వేయలేదు. తక్కువగా నరసాపురం నియోజకవర్గంలో 26,423 మంది ఓటుహక్కు వినియోగించుకోలేకపోయారు.

దోపిడీకి చెక్!



కోర్టు ఆదేశాలతో ర్యాంపుల మూత

- నూతన ప్రభుత్వంలోనే కొత్త విధానం
- మొన్నటివరకు నిబంధనలు పక్కన పెట్టి తవ్వకాలు
- మాఫియా అక్రమాలకు ఇక చెల్లు..
- వరదలు వస్తే వర్షాకాలం ఇసుక కరువే

పాలకొల్లు, మే 20 : ఉమ్మడి జిల్లాలోని ఇసుక ర్యాంపులు అన్నీ మూతపడ్డాయి. ఎన్నికల ముందు వరకూ పేట్రేగి పోయిన ఇసుక మాఫియా ఇప్పుడు ఇసుక ఎగుమతులను నిలిపి వేసింది. ఒక వైపు దేశ సర్వోన్నత న్యాయస్థానం మొట్టి కాయలు, మరోవైపు రాష్ట్రంలో అపద్ధర్మ ప్రభుత్వం ఉండటంతో మొత్తంగా ఇసుక సేకరణకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అను మతులు లేకుంగా ఇసుక ఎలా తవ్వుతున్నారని కోర్టు ప్రశ్నిం చగా నవ్యాంధ్రలో అక్రమ ఇసుక తవ్వకాలే లేవని రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులు మూకుమ్మడి వాంగ్మూలాలు ఇవ్వడం, ఐఏఎస్ అధికారులు సైతం ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంలో న్యాయస్థానాలను తప్పుదారి పట్టించడం సర్వత్రా విమర్శలకు దారితీసిన పరిస్థితుల్లో ఇప్పుడు మొత్తంగా ఇసుక సేకరణ నిలిచిపోయింది. జగన్ పాలనలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు కాగా, భవన నిర్మాణ రంగమూ ఉనికిని కోల్పోయింది. దీంతో ఇసుక అవసరాలు మూడింట ఒక వంతుకు వచ్చాయి. అయినప్పటికీ ఇసుకాసురులు అధిక ధరలకు ఇసుకను అమ్మి వేల కోట్ల రూపాయలు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరవేశారు.

జూన్ 4 తర్వాతే కొత్త పాలసీ

టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే ఇసుక ఉచితం చేస్తామని ఇప్పటికే కూటమి తరపున చంద్రబాబు ప్రకటించారు. పొరపాటున వైసీపీ అధికారంలోకి వస్తే ఇసుక 5 టన్నులు లక్ష రూపాయలకు అమ్మినా ఆశ్చర్య పోవలసిన అవ సరం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏ పార్టీ అధి కారం లోకి వచ్చినా జూన్ 4 తరువాత ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరమే ఇసుక సేకరణ నూతన విధానం వెలువడే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి కావాలంటే మరో నెల రోజులు సమయం పట్టవచ్చు.

వరదలు వస్తే..

సాధారణంగా జూన్ ద్వితీయ పక్షంలో గోదావరికి వరదలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. వరదలు వస్తే ఇసుక సేకరణ కష్ట సాధ్యమే. ప్రతీ ఏటా ఏప్రిల్, మే నెలలో గోదావరి పాయల నుంచి అధికంగా ఇసుక సేకరించి మైదాన ప్రాంతాల్లో నిల్వ చేస్తారు. అయితే ఇప్పుడు ఒక వైపు కోర్టు ఉత్తర్వులు, మరో వైపు అపద్ధర్మ ప్రభుత్వం నడుమ ఇసుక సేకరణ సాధ్యం కాదు. ఇప్పటికే జిల్లాలోని అధిక శాతం ర్యాంపులలో పరిమితికి మించి ఇసుక తవ్వేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా జగన్ ఇసుక మాఫియా రెచ్చిపోయింది. ఇప్పుడు హరిత అను మతులు లభ్యం కావడం కష్టమే. నదీపాయలలో ఏటి గట్టున చేర్చి బొండు ఇసుక, నదీ గర్భంలో నాలుగు నుంచి ఆరు అడుగుల మేర ఇసుక తవ్వేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని పోలవరం మొదలుకుని నరసాపురం వరకూ పలు చోట్ల ఏటి గట్టు బలహీన పడ్డాయి.

కోర్టు అనుమతులు రాకుంటే

దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇసుక తవ్వకాలపై కీలక ఆదేశాలు ఇచ్చింది. అధిక శాతం జిల్లా కలెక్టర్లు సైతం కోర్టును తప్పుదారి పట్టిస్తూ రాష్ట్రంలో ఎక్కడా గుప్పెడు ఇసుకను అక్ర మంగా తవ్వలేదని చెప్పుకొచ్చారు. జగన్ సర్కారుపై న్యాయ స్థానం సైతం అసహనం వ్యక్తం చేసిన పరిస్థితుల్లో ఇసుక తవ్వకాలకు వెంటనే అనుమతులు లభించడం కష్టమేనని పరిశీలకులు భావిస్తున్నారు.మొత్తంగా ఉమ్మడి జిల్లాతో పాటు నవ్యాంధ్రలో వచ్చే వర్షాకాలంలో ఇసుక కష్టాలు తీవ్ర మయ్యే పరిస్థితలు కనిపిస్తున్నాయి. కూటమి అధికారం చేపట్టి ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తే కొంత మేర ఇసుక కష్టాలు తొలగుతాయని అంచనా వేస్తున్నారు. కాగా మొన్న జరిగిన ఎన్నికలలో ఉభయ గోదావరి జిల్లాల క్వారీ లారీ యజ మానుల సంఘం నేరుగా కూటమికి మద్దతు పలకడం విధితమే. కూటమి అధికారం చేపడితే లారీ కిరాయిలు సైతం సరళ తరం చేస్తామని వినియోగదారులకు ఇబ్బందులు లేని రీతిలో ఇసుక సరఫరా చేస్తామని అసోసియేషన్ నాయకులు ఇప్పటికే స్పష్టం చేశారు. ఇసుక సరఫరా మెరుగుపరచడానికి నూతన ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు



ఇసుక ర్యాంపులను పరిశీలించిన ఏలూరు కలెక్టర్, ఎస్పీ

5



సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

5

ద్వారకాతిరుమల చిన వెంకన్న బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం సూర్యప్రభ వాహనంపై ఉభయ దేవేరులతో స్వామివారు పురవీధుల్లో ఊరేగారు..

ఉన్నా లేనట్టే!



- కార్యదర్శులకు అధికారాల్లేవ్
- సచివాలయాల నిర్వహణ అస్తవ్యస్తం
- సిబ్బంది మాత్రం ఫుల్
- కార్యాలయానికి వెళితే దొరకరు

తాడేపల్లిగూడెం రూరల్, మే 20: గ్రామ పంచాయతీల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం.. సచివాలయ వ్యవస్థతో గ్రామానికో రాజధాని ఏర్పాటు చేసి నట్టు ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం వాస్తవానికి గ్రామాల అధికారాలను నిర్వీర్యం చేసింది. గ్రామంలో జనాభాను బట్టి వలంటీర్‌లు, సచివాలయాల్లో శాఖల వారీగా సిబ్బందిని ఏర్పాటు చేసి ఆ సచివాలయాల నిర్వహణకు కార్యదర్శిని కన్వీనర్‌గా చేశారు. అయితే క్షేత్ర స్థాయిలో మాత్రం పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. దీనివల్ల గ్రామాల్లో ప్రజలకు అందించాల్సిన సేవలు అందడం లేదు.గతంలో కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారితో ప్రజలకు కావాల్సిన అవసరాలు అందించే వారు. కానీ ప్రస్తుతం సచివాలయాల్లో పదుల సం ఖ్యలో సిబ్బంది ఉన్నా ప్రజల అవసరాలను తీర్చే అధికారులు కరువయ్యారు. ముఖ్యంగా గ్రామ కార్యదర్శి చేయాల్సిన పనులు చేసే పనులు కూడా చేయడానికి వీలులేని డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్స్ (డీడీవో) అధికారాల్లేక పేరుకే కన్వీనర్‌లుగా పనిచేస్తున్నారు.

సర్పంచ్‌లకూ అయోమయమే..

గ్రామాల్లో ప్రజలతో ఎన్నికై వారికి ప్రతినిధిగా ఉన్న సర్పంచ్‌లకు కూడా సచివాలయ సిబ్బంది ఏ సమయంలో ఎక్కడ ఉంటున్నారో ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి. ఎవరైనా గ్రామంలో స్థల సమస్య ఉందని ఒక వ్యక్తి సచి వాలయానికి వస్తే సచివాలయంలో ఉండాల్సిన గ్రామ సర్వే యర్ ఎక్కడున్నాడో అప్పటికప్పుడు వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఏదైనా గట్టిగా మాట్లాడితే మండల సర్వేయర్ వేరే పని చెప్పారంటూ ఐదు నెలల నుంచి సచివాలయాలకు దూరం గానే పనిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అందుబాటులో ఉండేదెవరు?

సచివాలయ వ్యవస్థలో ప్రభుత్వం నియమించిన గ్రామ సర్వేయర్, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు, అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్,ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, హార్టీకల్చర్ అసిస్టెంట్, ఆరోగ్య సహాయకులు, ఫిషరీస్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ ఇలా పదకొండు శాఖలకు సంబంధించి సిబ్బంది సచివాలయంలో ఉన్నా గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండే పరిస్థితి లేదు.గ్రామ స్థాయిలో విధులు కేటా యించడం మాత్రం ఉన్నత అధికారుల చేతుల్లోనే సాగుతోంది. ఉదాహరణకు మహిళా పోలీసులకు గ్రామంలోని ప్రొటెక్షన్, మహిళల రక్షణ, గ్రామంలో నేరాలపై అవగాహన కల్పించాల్సి ఉన్నా వారిని బందోబస్తులకు ఉపయోగించకూడదని కోర్టు ఆదేశాలిచ్చినా ఎక్కడ ఏ బందోబస్తు చేయాలన్నా అక్కడ వారు ఉండాల్సిందే. దీంతో గ్రామాల్లో వారికి ఎటువంటి పట్టు ఉండడం లేదు. అగ్రికల్చర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఆరోగ్య సహాయకులు, సర్వేయర్‌లు ఇలా అందరూ ఆయాశాఖల మండల అధికారుల సేవల్లోనే సిబ్బంది తరిస్తుంటారు. దీంతో పేరుకే సిబ్బంది ఉంటారు. సచివాలయాల్లో మాత్రం అందుబాటులో ఉండరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేరుకే కన్వీనర్ అయిన సెక్రటరీ మాకేమీ తెలియదంటూ చేతులెత్తేస్తారు.

ఆ కార్యదర్శులకు అధికారాల్లేవు

జగన్ సర్కారు నియమించిన సచివాలయ వ్యవస్థలో నియమించిన గ్రేడ్-5 కార్యదర్శులు కేవలం కుర్చీకే కన్వీనర్. మూడు నెలల క్రితం ప్రభుత్వం డీడీవో (డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్) హోదా కల్పిస్తూ హడావుడిగా జీవో విడుదల చేసినా అది ఆర్డర్‌కే పరిమితం. ఈ హోదా అమలైతే సిబ్బంది జీతాలు వారి ద్వారానే పెట్టాలి కాబట్టి పనితీరు సమీక్షించి జీతాలు పెట్టేందుకు వీలుంటుంది. తద్వారా వారితో పని చేయించేందుకు అవకాశం ఉంటుందని కార్యదర్శులు చెబుతున్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జిల్లాలో 25 పరీక్ష కేంద్రాలు..10,946 మంది విద్యార్థులు

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి : జేసీ ప్రవీణ్ ఆదిత్య



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ

భీమవరం ఎడ్యుకేషన్, మే 20 : ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య అధికారులను ఆదేశించారు. సోమవారం పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కమిటీ సభ్యులు, విద్యాశాఖ, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, వైద్యఆరోగ్యశాఖ, మున్సిపల్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని మొదటి సంవత్సరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ సంవత్సరం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశామని, మొదటి, రెండో సంవత్సరానికి సంబంధించిన మొత్తం 10,946 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. మొదటి సంవత్సరం జనరల్ కింద 8,793 మంది, ఒకేషనల్ 384 మంది, మొత్తం 9,177 మంది రాయనున్నారన్నారు. రెండో సంవత్సరం జనరల్ 1,547 మంది, ఒకేషనల్ 222 మంది మొత్తం 1,769 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. జూన్ 6న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 7న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష జరుగుతాయని ఈ రెండూ తప్పనిసరిగా రాయాల్సి ఉంటుందని తెలిపారు.పరీక్షకు గంట ముందు హాజరు కావాలన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సప్లై ఉండేలా చూసుకోవాలన్నారు. దివ్యాంగులు ఉంటే వారికి ప్రత్యేక ఏర్పాట్లు చెయ్యాలన్నారు. మొబైల్‌ఫోన్లు, కాలిక్యూలేటర్లు, ఐపాడ్, బ్లూటూత్, పేజర్, లేదా ఇంట్రాక్ట్ ప్రోగ్రామింగ్ చేయగల ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రానికి అనుమతి లేదని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో రక్షిత మంచినీటి సరఫరా, పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలని ఆదేశించారు. పరీక్షలు జరిగే తేదీలలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష సమయాలకు అనువుగా బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షలలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా కేజీఆర్ఎల్ కాలేజీలో కమాండ్ కంట్రోల్ రూమ్ నంబరు: 90595 83683 (జయరామ్) ఏర్పాటు చేశామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఇంటర్మీడియట్ ఆర్ఐవో, జిల్లా పరీక్షల కమిటీ కన్వీనరు కె.చంద్రశేఖర్‌బాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటరమణ, జిల్లా పంచాయతీ శాఖ అధికారి విక్టర్ వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీకి ఏర్పాట్లు : డీఆర్వో

పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని జిల్లాలో భీమవరం, ఆకవీడు, తాడేపల్లిగూడెం, తణుకు, పెనుగొండ, పాలకొల్లు, నర్సాపురం, అత్తిలిలలో మొత్తం 41 కేంద్రాలలో 8,953 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు సంబంధించి 1,590 మందికి భీమవరం, నరసాపురంలలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు నిర్వహణ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి అహ్మద్‌ఖాన్, ఆర్టీసీ అధికారి గీతావాణి, పోస్టల్ అధికారి పరుశురాం, వైద్యశాఖ అధికారి సందాని పాల్గొన్నారు.

లూజు పెట్రో అమ్మకాలపై నిషేధం

రైతులకు కష్టాలు

ముదినేపల్లి/నూజివీడు టౌన్, మే 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకూడదనే ఉద్దేశంతో పోలీసు అధికారులు తీసుకు న్న నిర్ణయం ఇటు వాహనదారులకు, అటు రైతులకు ఇబ్బందిగా మారింది. సమస్యాత్మక ప్రాంతాలను దృష్టి లో పెట్టుకుని పెట్రోల్ ఉత్పత్తుల లూజు విక్రయాలపై (బాటిల్స్‌లో) పోలీస్ శాఖ నిషేధం విధించింది. రూరల్ ప్రాంతాల్లో వాహనాలు ఆగిపోతే బాటిల్లో పెట్రోల్ తీసు కువెళతారు. కాని, ఇప్పుడు బాటిల్స్‌లో పెట్రోల్ విక్రయా నికి బంకుల నిర్వాహకులు నిరాకరిస్తున్నారు. మరోవైపు వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో స్ప్రేయర్లు, ఉడ్ కటర్లకు అవసరమైన పెట్రోల్‌ను బాటిళ్ళు క్యాన్‌లలో తీసుకువెళతారు. చేపలు, రొయ్యల చెరువుల వద్ద జనరేటర్ల వినియోగానికి ఆక్వా రైతులు ట్రాక్టర్లలో పెద్ద డబ్బాలు, ప్లాస్టిక్ టిన్నులలో ఒకేసారి వందల లీటర్ల డీజిల్‌ను కొనుగోలు చేస్తుంటారు. ముది నేపల్లి ప్రాంతంలోని తొమ్మిది పెట్రోల్ బంకుల్లో నిత్యం వాహనాలకు డీజిల్ అమ్మడంకంటే వేలాది ఎకరాలకు ఆక్వా రైతులు కొనుగోలు చేసే డీజిల్ పరిమాణం ఎక్కువ. వ్యవసాయ సీజన్‌లో దుక్కులు చేసేందుకు ట్రాక్టర్ల యజమానులు బైక్‌లపై ప్లాస్టిక్ టిన్నులతో డీజిల్ తీసుకెళతారు. ఎన్నడూ లేని విధంగా డబ్బాలు, బాటిల్స్‌లో డీజిల్, పెట్రోలు కొట్టవద్దని అధికారులు ఆదేశించటంతో ఈ విధమైన అమ్మకాలు నిలిచిపోయా యి. చేపలు, రొయ్యల చెరువులపై జనరేటర్లకు డీజిల్ ఎలా తీసుకెళ్లాలన్నది కొత్త సమస్య వచ్చి పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే చెరువుల్లో ఏరియేటర్లు ఆగి పోకుండా జనరేటర్ ఆన్ చేయాలి. డీజిల్ కూడా సిద్ధం గా ఉండాలి. బంకుల్లో డబ్బాల్లో డీజిల్ కొట్టకపోతే ఎలా అని ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలు కాని ప్రశాంత వాతావరణం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ నిబంధనలను కఠినంగా అమలుపర్చటం వల్ల రైతులు, వాహనదారు లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిబంధనలు సడ లించి చెరువుల వద్ద జనరేటర్లకు డీజిల్‌ను డబ్బాల్లో తీసుకెళ్లేందుకు ఆక్వా రైతులకు అనుమతి ఇవ్వాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు కోరుతున్నారు.



పాలకొల్లులో బంక్ వద్ద యజమానులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మల

ఆక్వా రైతులను ఇబ్బంది పెట్టొద్దు

కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే

పాలకొల్లు టౌన్, మే, 20 : ఆక్వా రైతులను ఇబ్బంది పెట్టొద్దని పెట్రోల్ బంకు యజమానులను పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు కోరారు. ఎన్నికల అనంతరం జరుగుతున్న అల్లర్ల దృష్ట్యా బంకుల్లో బాటిల్స్, డబ్బాలలో పెట్రోల్, డీజిల్ కొట్టవద్దని ఎన్నికల సంఘం ఆదేశాల వల్ల ఆక్వా రైతులు నష్టపోతున్నారన్నారు. సోమవారం ఆయన పాలకొల్లులోని పెట్రోల్ బంకుల వద్దకు వెళ్లి బంకుల యజమానులతో మాట్లాడారు. అక్కడ నుంచే జిల్లా కలెక్టర్, నరసాపురం డీఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం మార్పులతో ఆక్వా చెరువులకు ఆక్సిజన్ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మరోపక్క విద్యుత్‌లతో జనరేటర్లను వినియోగించుకోవాల్సి వస్తుందన్నారు. అందువల్ల జనరేటర్లకు అవసరమైన డీజిల్, పెట్రోల్ బంకుల్లో కొట్టకపోవడంతో ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసలే ఆక్వా రంగం ఇబ్బందుల్లో ఉందని ఇటువంటి తరుణంలో ఈ నిబంధనలు మరింత ఇబ్బంది పెడుతున్నాయన్నారు. ఆక్వా చెరువులకు అవసరమైన డీజిల్ అందించాలని కలెక్టర్, డీఎస్పీలను కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.



ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

అల్పపీడనం అలజడి

భీమవరం రూరల్, మే 20 : వర్షాలు రైతులను పరుగులు పెట్టిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయుగుండం హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పగలు ఎండ తీవ్రత, ఉక్కపోత , సాయంత్రం మబ్బులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో పలుచోట్ల వరి కోతలు పూర్తికాలేదు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు కోసిన పంటను దక్కించుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కొందరు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్ర యిస్తున్నారు. భీమవరం మండలంలో తాడేరు, బేతపూడి, తుందుర్రు, పెదగరువు ప్రాంతాలలో ఇంకా కోత కోయని పంట చేలు, ధాన్యం రాసులు ఉండటంతో నాలుగు రోజులుగా అవస్థలు పడుతున్నారు.వర్షాల వల్ల ధాన్యం ఎండబెట్టేందుకు వీలవడం లేదు. ధాన్యం రాశుల్లోకి వర్షపునీరు చేరుతుందని భయపడుతున్నారు. వర్షాల కారణంగా కొన్ని చోట్ల మాసూళ్లు నిలిచిపోయాయి. 22 నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇది 24 నాటికి మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి వాయుగుండంగా బలపడుతుందని తర్వాత మరింత బలపడే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఉపరితల ద్రోణి విస్తరించిన కారణంగా పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు, పిడుగులు పడే అవకాశాలు న్నాయి.

అత్తిలిలో 33.8 మి.మీ వర్షపాతం

భీమవరం టౌన్ : వాతావరణంలో మార్పు కారణంగా ఆదివారం ఉదయ నుంచి సోమవారం వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అత్తిలిలో అత్యధికంగా 33.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా తాడేపల్లిగూడెంలో 0.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పెనుమంట్రలో 2.8 మి.మీ, పెనుగొండలో 8.6, పోడూరులో 7.4, పాలకొల్లులో 7.4, పెంటపాడు6, తణుకులో 3.2, ఇరగవరంలో 16.5 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు.



సూర్యప్రభపై తిరువీధులకు తరలివెళ్తున్న శ్రీవారు, అమ్మవార్లు

సూర్య ప్రభ వాహనంపై శ్రీవారు

ద్వారకాతిరుమల, మే 20: సప్త అశ్వాలను అధిరోహించిన సూర్యభగవానుని వాహనంగా చేసుకుని.. తేజోవిరాజితుడైన చిన్న తిరుమలేశుడు సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో భక్తులను అనుగ్రహించారు. సూర్య ప్రభ వాహనంపై ఉభయదేవేరులతో శ్రీవారిని ఉంచి ప్రత్యేక అలంకరణ చేసి హారతులిచ్చారు. పిల్లనగ్రోవి ధరించి చిన్ని కృష్ణుని అలంకారంలో ఉన్న స్వామివారు చిరుమందహాసధారియై తన ఉత్సవ వైభవాన్ని వీక్షించే భక్తులకు అభయ హస్తంతో వరాలు కురిపిస్తున్నట్లుగా కనువిందు చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, అర్చకుల మంత్రాల నడుమ ఉభయ దేవేరులతో చినవెంకన్న క్షేత్రపురవీధుల్లో భక్తులను అనుగ్రహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం ఏడు గంటలకు హనుమద్వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం
- రాత్రి ఏడు గంటలకు ఎదుర్కోలు ఉత్సవం
- రాత్రి 8.30 గంటలకు వెండి శేషవాహనంపై తిరువీధిసేవ

యోగశ్రీనివాసునిగా..



యోగశ్రీనివాసుని అలంకారంలో చినవెంకన్న భక్తజనులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. స్వర్ణాభరణాలు ధరించి, పుష్పాలంకరణతో యోగ ముద్రలో కూర్చుని ఉన్న శ్రీవారిని దర్శించిన భక్తులు పరవశించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిత్యం జరుగుతున్న అలంకా రోత్సవాలు సైతం భక్తులను అలరిస్తున్నారు. ఈక్రమంలో వల్మీకంలో ఉన్న యోగ శ్రీనివాసుని దర్శనం చూపురులకు కనువిందైంది.



పద్మావతి కల్యాణం భరత నాట్యప్రదర్శన

అలరించిన భరతనాట్య ప్రదర్శన

ద్వారకాతిరుమల, మే20: శ్రీహరి కళాతోరణ వేదికపై సోమవారం సాయంత్రం చిన్నారులు నిర్వహించిన కూచిపూడి భరత నాట్య ప్రదర్శన చూపరులను అలరించింది. స్వామివారి వైశాఖ మాస దివ్యబ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తణుకుకు చెందిన పద్మజ నృత్య కళా నికేతన్ వారిచే చిన్నారులు ప్రదర్శించిన పద్మావతి కల్యాణం రూపకం చూపరులను ఆకట్టుకుంది. అలాగే అయిగిరి నందిని.. నందిత మేదిని.. మహిషాసుర మర్దిని స్తోత్రంకు జరిపిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆలరించాయి.



విద్యుద్దీపాలంకరణలో శ్రీవారి ఆలయం

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అడ్మిషన్లు

ఏలూరు రూరల్, మే 20: ప్రభుత్వ ఐటీఐ, 14 ప్రైవేట్ ఐటీఐలకు 2024-25 విద్యా సంవత్సరానికి వంద శాతం అడ్మిషన్లకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టి.రజిత తెలిపారు. దీనిలో భాగంగా జిల్లా ఉపాధి అధికారి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఒకేషనల్ గైడెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. 8, 10వ తరగతి పాసై లేదా ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఐటీఐ కోర్సుల వివరాలను కరపత్రాల ద్వారా జిల్లాలోని ప్రతి సచివాలయంలో అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఐటీఐలో 876 సీట్లు, ప్రైవేట్ ఐటీఐలో 1,672 సీట్లు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి మధుభూషణ్‌రావు, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 15 నుంచి రైతు కూలి సంఘం మహాసభలు

ఏలూరు టూ టౌన్, మే 20: రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభలు జూన్ 15, 16, 17 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్నట్లు రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రిఝాన్సీ సీఐటీయూ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాటాడుతూ 15న ప్రారంభ సభతో పాటు నగరంలో ప్రదర్శనలు, బహిరంగ సభలు జరుగుతాయన్నారు. 16న రైతుల సమస్యల పై రైతు, ప్రజాతంత్ర, మేధవుల ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తామన్నారు. 17న సంస్థ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జిల్లా కార్యదర్శి భాష, అడ్వొకేట్ పీవీ.శాస్త్రి, డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఏపీఈఏపీ సెట్ పరీక్ష ప్రశాంతం

భీమవరం ఎడ్యుకేషన్, మే 20 : ఏపీఈఏపీ సెట్ ఇంజనీరింగ్ పరీక్ష విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో సోమవారం 200 విద్యార్థులకు 193 మంది, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో 300కి 295 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 350 మందికి 338 మంది పరీక్ష రాశారు. నర్సాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 312 మందికి 307 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

పది తర్వాత ఇంజనీరింగ్

- ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు ఈ నెల 25 వరకు దరఖాస్తుల స్వీకరణ
- జూలై ఒకటి నుంచి పరిశీలన

ఉన్నత సాంకేతిక విద్య పొందాలనుకునే విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ ఒక వరం. పదో తరగతి పాస్ అయితే చాలు ఈ విద్యా సంస్థలో ప్రవేశం పొందితే ఇంజనీరింగ్ పట్టాతోనే వచ్చేలా రూపకల్పన చేశారు. ఆరేళ్లపాటు ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యను రెసిడెన్షియల్ విధానంలో బోధిస్తుండగా తొలి రెండేళ్ల విద్యను పీయూసీగా, అనంతరం నాలుగేళ్ల విద్యను ఇంజనీరింగ్‌గా పరిగణిస్తారు.



నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ప్రవేశ ద్వారం

నూజివీడు టౌన్, మే 20: రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఈ నెల 8వ తేదీ నుంచి చేపట్టారు. ఆర్జీయూకేటీలో గ్రామీణ స్థాయి విద్యార్థులకు ఉన్నత సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో 2008లో ఉమ్మడి రాష్ట్రంలో ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యను రెసిడెన్షియల్ విధానంలో బోధిస్తుండగా తొలి రెండేళ్ల విద్యను పీయూసీగా, అనంతరం నాలుగేళ్ల విద్యను ఇంజనీరింగ్‌గా పరిగణిస్తారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్లు ఇస్తుండగా, ఈ నెల 8 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ నిర్వహిస్తున్నట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ) శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌ల్లోని నాలుగు వేల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సీట్లకు మరో 400 సూపర్ న్యూమరరీ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సీట్లకు అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించనున్నారు. మరో నాలుగు రోజుల్లో ఈ అడ్మిషన్ల ప్రక్రియ ముగుస్తుండగా, 12 రోజులుగా 35 వేల దరఖాస్తులు దాఖలైనట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. ప్రత్యేక కేటగిరిల్లోని విద్యార్థులకు జూలై ఒకటో తేదీ నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభిస్తుండగా, సాధారణ విద్యార్థులకు జూలై 22 నుంచి వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జూలై 22న నూజివీడు క్యాంపస్ విద్యార్థులకు, ఆర్కేవ్యాలీ విద్యార్థులకు, 24న ఒంగోలు క్యాంపస్ విద్యార్థులకు ఆర్కేవ్యాలీలో, 26న శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులకు శ్రీకాకుళంలోని ఏచ్చర్ల క్యాంపస్‌లోనూ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించనున్నారు.

సూపర్‌మెరిట్ అయితేనే అడ్మిషన్

ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలలో అడ్మిషన్లు పొందాలంటే సూపర్‌మెరిట్ అయితేనే అడ్మిషన్ సాధ్యమనే పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్ ఎస్ఎస్‌సీ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో దాదాపు 82 శాతం మంది విద్యార్థులు పాస్ కాగా, అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులు అనేక మంది ఉన్నారు. 600 మార్కులకు గాను 599 వరకు మార్కులు సాధించడంతో ఈసారి విద్యార్థులు సూపర్‌మెరిట్ అయితేనే అడ్మిషన్లు పొందే అవకాశం ఉంది. గత విద్యాసంవత్సరంలో ఏపీఎస్ఎస్‌సీ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో 62 శాతం మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులు అవ్వగా, ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్లు పొందిన వారి కటాఫ్ మార్కులు ఈ విధంగా ఉన్నాయి. జనరల్ కేటగిరి, బీసీ (ఏ), బీసీ (డి), ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల కటాఫ్ 582 ఉండగా, బీసీ (బి) విద్యార్థుల కటాఫ్ 581, బీసీ (సీ)లో 561, బీసీ (ఈ)లో 576, ఎస్సీలో 573, ఎస్టీ విద్యార్థులకు 560 మార్కులుగా కటాఫ్ ఉంది. అయితే ఈసారి ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్‌లు పొందాలంటే 590 మార్కులకు పైబడి, మార్కులు సాధించిన విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్లు దక్కే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

రిజర్వేషన్ ఇలా..

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశానికి రిజర్వేషన్ విధానాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నారు. మొత్తం సీట్లలో ఎస్సీలకు-15 శాతం, ఎస్టీలకు-6 శాతం, బీసీ (ఏ)-7 శాతం, బీసీ (బీ)-10 శాతం, బీసీ (సీ) -1 శాతం, బీసీ (డి) -7 శాతం, బీసీ (ఈ) -4 శాతం, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి (పీహెచ్) - 5 శాతం, సీఏపీ -2 శాతం, ఎన్‌సీసీ -1, స్పోర్ట్స్ - 0.5, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఐదు శాతం వంతున రిజర్వేషన్లు అమల్లో ఉంటాయి.

ఫీజులు ఇలా..

ఆర్‌జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్లు పొందే విద్యార్థులు పీయూసీలో ఏడాదికి రూ.45 వేలు, ఇంజనీరింగ్‌లో రూ.50 వేలు ట్యూషన్ ఫీజు చెల్లించాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత ఉన్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు మినహాయింపు ఉంది. మెస్ ఛార్జీల రూపంలో ప్రతి విద్యార్థి నెలకు రూ.3 వేల వరకు చెల్లించాలి. వసతి దీవెన ద్వారా నిధులు మంజూరైతే ఆ మొత్తం పోను మిగిలిన మొత్తాన్ని క్యాంపస్‌కు చెల్లించాలి. ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజు కింద రూ.3 లక్షలతోపాటు, మెస్ ఛార్జీలు రూ.3 వేలు చెల్లించాలి.

ఉత్తమ నాటికగా 'మలి సంధ్య'



ముగిసిన నాటిక పోటీలు

ఉత్తమ నాటిక 'మలి సంధ్య' కళాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న కొంతేరు యూత్ క్లబ్ నాటక పరిషత్ కార్యవర్గ సభ్యులు

యలమంచిలి, మే 20: కొంతేరు యూత్ క్లబ్ నాటక పరిషత్ 42వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అఖిల భారత స్థాయి నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ నాటిక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా శ్రీషిర్డిసాయి కల్చరల్ క్రియేషన్స్ అనకాపల్లి వారి 'మలిసంధ్య', ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఆరాధనా ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి 'క్షేత్రం', తృతీయ ఉత్తమ ప్రదర్శనగా శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ గుడివాడ వారి 'మళ్లీ కలిసి జీవిద్దాం' ఎంపికైనట్లు పరిషత్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఉన్నమట్ల కబర్ధి, సీహెచ్ సత్యనారాయణమూర్తి ఉత్తమ ప్రదర్శనలు, ఉత్తమ దర్శక, రచయిత, నటులకు జ్ఞాపిక, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కబర్ధి మాట్లాడుతూ నాటికలు సమాజ చైతన్యానికి ప్రతీకలు అని పేర్కొన్నారు. కొంతేరు యూత్‌క్లబ్ నాటక పరిషత్ 42 సంవత్సరాలుగా నాటికల పోటీలు నిర్వహించడం అభినందనీ యమన్నారు. ఈ కార్యక్రమంలో డేవిడ్‌రాజు, పరిషత్ కార్య దర్శి గంటా ముత్యాలరావు, ఉపాధ్యక్షులు బోణం రవిబాబు, జక్కంశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి అంబటి నవీన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



'రైతే రాజు'లోని ఓ సన్నివేశం

అలరించిన 'రాత', 'నాలోన నీవే'

భీమవరం అర్బన్ : కళారంజని నాటక అకాడమి ఆ ధ్వర్యంలో భీమవరంలోని శ్రీసోమేశ్వర, జనార్ధన స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో మూడో రోజు సోమవారం రాత్రి రెండు నాటికలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన టౌన్ హల్ అధ్యక్షులు మెంటే పార్థసారధి మాట్లాడుతూ కనుమరుగవుతున్న కళలను కళాకారులను ప్రోత్సహించడానికి కళారంజని వంటి నాటక పరిషత్‌లు చేస్తున్న కృషి ఎన్నలేదన్నారు. అనంతరం వెలగలేరుకు చెందిన ప్రముఖ కళాకారుడు శ్రీనివాసరావుకు కళారంజని యువకళాతేజం పురస్కారాన్ని, తణుకు పట్టణానికి చెందిన నాట్య కళాకారిని కుమారి రావూరి యోగాంబికకు నాట్య వసంత బిరుదును, మహానటి సావిత్రి పురస్కారాన్ని గుంటూరుకు చెందిన కళాకారిని కె.సరితకు ప్రదానం చేశారు. ఆనంతరం ప్రదర్శించిన నాటికలు ఆహుతులను కళా ప్రియులను అలరించాయి. నాటక పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు జవ్వాది దశరధి శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు నల్లం వెంకట కృష్ణ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెంటే పూర్ణ చంద్రరావు, మల్లుల సీతారామ ప్రసాద్, గుండా రామకృష్ణ, బోండా రాంబాబు, తదితరులు అధిక సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొన్నారు. 'రాత' నాటిక ద్వారా కష్ట సుఖాలలో మనిషి ప్రవర్తనను, భార్య భర్త, అత్తకోడళ్లు ఎలా ఉంటే బావుంటుందో తెలియజేసిన శ్రీకరణ సురేష్ మెమోరియల్ గుంటూరి వారి 'నాలోన నీవే' నాటికల ద్వారా చక్కగా వివరించారు. ఆయా నాటికలకు రచన దర్శకత్వం శ్రీనివాసరావు, రామకృష్ణ, పాత్రదారులుగా సురభి వాగ్దేవి, శ్రీనివాసరావు, సురభి రఘు, పవన్ కళ్యాణ్, శివప్రసాద్, కరణ సరిత, ఉమామహేశ్వరరావు, బొమ్మిడి రామకృష్ణ, రాయుడు నటించారు.



నాట్యవసంత బిరుదు సత్కారం అందుకుంటున్న కళాకారిని యోగాంబిక

ఆకట్టుకున్న నాటికలు

తాడేపల్లిగూడెం రూరల్ : భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సహకారంతో, తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ నృత్య, నాటక పోటీలలో మూడో రోజు సోమవారం సాంఘీక నాటికలు అలరించాయి. హైదరాబాద్ కళాంజలి వారు ప్రదర్శించిన రైతే రాజు ఆహుతులను ఆకట్టుకుంది. అదే విధంగా కొలకులూరు సాయి ఆర్ట్స్ ప్రదర్శించిన కౌసల్యా సుప్రజా రామ నాటిక అలరించింది. ఈ నాటికలను బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల రామారావు పర్యవేక్షించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు

ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్



దాచరం ఇసుక ర్యాంప్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

వేలేరుపాడు, కుక్కునూరు, మే 20: ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తా మని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు. వేలేరుపాడు మండలం రుద్రంకోట వద్ద ఇసుక రీచ్‌ను అధికారులతో సోమవారం కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనుమతి ఉన్న ఇసుక రీచ్‌లలోనే ఇసుక మైనింగ్ చేయాలని అనుమతి లేని రీచ్‌లలో తవ్వకాలు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవన్నారు. ఇలా చేస్తే వాహనాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేయాలని పోలీస్, మైనింగ్ అధికారులను ఆదేశించారు. కుక్కునూరు మండలంలోని దాచారం, వింజరం, ఇబ్రహీంపేట ఇసుకరీచ్‌లను ఇసుక అక్రమ మైనింగ్‌ను నిరోధించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ఇసుక ర్యాంప్‌లను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాలోని షెడ్యూల్ ప్రాంతాల్లో ప్రతి ఇసుక రీచ్ వద్ద నిరంతరం సిబ్బందితో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తామని రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. స్థానికులతో మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా పెట్టామని అయినప్పటికి ఎక్కడైన తవ్వకాలు, రవాణ జరిగితే వెంటనే రెవెన్యూ, పోలీస్, గ్రామ వీఆర్వోలకు సమాచారం అందించాలన్నారు. అలా సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. కాగా ఇబ్రహీం పేటలో భారీగా నిల్వ చేసిన ఇసుకను పరిశీలించారు. నిల్వ ఉన్న ఇసుక ఎన్ని యూనిట్లు ఉందో కొలతలు వేసి రిపోర్టు అందించాలన్నారు. అలాగే పోలీస్ సిబ్బందిని కూడా నియమించి ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట ఎస్పీ మేరీ ప్రశాంతి, జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీఓ సూర్యతేజ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావు, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.హద్దయ్య, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, గనుల శాఖ డీడీ రవికుమార్, భూగర్భజల శాఖ డీడీ విజయ్‌కుమార్, రెవెన్యూ పోలీసు వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందిస్తాం : కలెక్టర్ సుమిత్

నరసాపురం రూరల్; మే 20: ఓఎన్‌జీసీ పైప్‌లైన్ పనులు వివాదం సోమవారంతో ఒక కొలిక్కి వచ్చినట్లయింది. వైఎస్‌పాలెం, సీతారాంపురం, రుస్తుంబాదా గ్రామాల వద్ద పనులు చేపట్టేందుకు ససేమేరా అనడంతో వైఎస్ పాలెంలో మూడు రోజులుగా పనుల వద్ద రైతులు ఆందోళనలు, సమావేశాలు నిర్వహిస్తునే ఉన్నారు. చివరికి సమస్యను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వివరించారు. దీంతో సోమవారం ఓఎన్‌జీసీ అధికారులు, రైతులతో కలెక్టర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మీకు అండగా ఉంటా, నష్టపోతున్న రైతులకు పరిహారం అందిస్తామని కలెక్టర్ చెప్పగా, దీనికి రైతులు సానుకూలంగా స్పందించినట్లు తెలియవచ్చింది. పైప్‌లైన్ల వల్ల తమ భూములను నష్టపోతున్నామని, తగిన పరిహారంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్‌కు రైతులు విన్నవించారు. దీనికి స్పందించిన కలెక్టర్ పైప్‌లైన్ వెళ్లే మార్గంలో సర్వే చేయించి ఎవరైతే భూములు నష్టపోతారో వారందరికీ నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు మూడు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని కలెక్టర్ చెప్పినట్లు రైతులు తెలిపారు.



రైతులతో చర్చిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, మే 20: పెదతాడేపల్లి వద్ద సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కొబ్బరితోటకు చెందిన రామి శెట్టి పాపారావు (55) బిల్డింగ్ మెటీరియల్స్ సప్లయ్ చేస్తుంటారు. అయితే ఉదయం ఆ పనిమీద వెల్లమిల్లి వెళ్లి తిరిగి వస్తుండగా భారతీయ విద్యా భవన్స్ సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేష్ తెలిపారు.

కట్నం కోసం భార్యపై కర్రతో దాడి

పోలవరం, మే 20 : కట్నం డబ్బు కోసం భార్యపై కర్రతో దాడి చేసి గాయపరిచిన సంఘటన పోలవరంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పోలవరం గ్రామానికి చెందిన మేడూరి సౌజన్య తన పెళ్లిలో తల్లిదండ్రులు ఇచ్చిన కట్నం డబ్బులు తనకివ్వమని భర్త మేడూరి రాంప్రసాద్ వేధించాడని, నిరాకరించడంతో కర్రతో తలపై కొట్టి గాయపరిచినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బీచ్‌లో త్రుటిలో తప్పిన ప్రమాదం

మొగల్తూరు, మే20 : సముద్రస్నానికి వచ్చిన ఒక యువకుడు తృటిలో పెనుప్రమాదం నుంచి బయట పడ్డాడు. పెనుగొండకు చెందిన 10 మంది యువకులు నరసాపురం పట్టణంలో క్యాటరింగ్ పని నిమిత్తం వచ్చారు. అక్కడ పని ముగించుకున్న అనంతరం పేరుపాలెం బీచ్‌కు వచ్చిన వీరులో కొందరు సముద్ర స్నానికి దిగారు. వీరిలో దొంగ గౌతమ్ కుమార్ అనే యువకుడు అలల తాకిడికి సముద్రంలో కొట్టుకుపోతుండగా గమనించిన అతని స్నేహితులు, స్థానికులు గుర్తించి ఒడ్డుకు తీసుకువచ్చి సపరియలు చేశారు. అక్కడ నుంచి 108 వాహనంలో నరసాపురం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు

జాతీయ దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ అంపైర్‌గా నాగేంద్ర



ఏలూరు స్పోర్ట్స్, మే 20: పూణేలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జాతీయ దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుంది. ఈ క్రికెట్ పోటీలకు అంపైర్‌గా ఏలూరుకు చెందిన రాజపుట్ నాగేంద్రసింగ్ వ్యవహరించనున్నట్లు ముంబై, మహారాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ భగవాన్ తల్వారే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమ బెంగాల్, బరోడా, మధ్యప్రదేశ్, బీహార్, పాండిచ్చేరి, పాస్‌టీమ్, మహారాష్ట్రంలో పోటీల్లో పాల్గొంటున్నాయి. జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు అంపైర్‌గా ఎంపికైన నాగేంద్రసింగ్‌ను మండల విద్యాశాఖ అధికారి, సహచర ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. మంగళవారం సింగ్ పూణె బయల్దేరి వెళుతున్నట్లు ఆయన తెలిపారు.

కరాటే పోటీలలో గోల్డ్ మెడల్స్



గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు

నిడమర్రు మే 20 : గోవాలో జరిగిన ఇంటర్‌నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో కొల్లేరు తీరప్రాంత ఆణిముత్యాలు మెరిసాయి. లైఫ్ కరాటే ఇండియా చీఫ్ కోచ్ కల్యాణ్ సుందరం తెలిపిన వివరాలు ప్రకారం ఈ నెల 19న గోవాలోని మనోహర్ పారికర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన యూఎస్‌కేఐ 369 నిర్వహించిన ఇంటర్‌నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో భువనపల్లి గ్రామానికి చెందిన పి.గౌతమ్, కె.దత్తాత్రేయ బంగారు, కాంస్య పతాకాలు సాధించారు. కలర్ బెల్ట్ 16సంవత్సరాల విభాగంలో పల్లి గౌతమ్ కూటీ ఫైటింగ్‌లో బంగారు పతకం, కటా వ్యక్తిగత ప్రదర్శన విభాగంలో కాంస్య పతకం సాధించారు. అలాగే కలర్ బెల్ట్ 12సంవత్సరాల విభాగంలో కె.దత్తాత్రేయ కూటీ ఫైటింగ్‌లో బంగారం, కటా వ్యక్తిగత ప్రదర్శన విభాగంలో కాంస్య పతకం పాధించారని కల్యాణ్ సుందరం తెలిపారు. వీరికి భువ్వనపల్లి గ్రామానికి చెందిన బేతు దుర్గా సూర్యప్రకాష్ కోచ్‌గా వ్యవహరించారు. ప్రముఖ సినీ హీరో సుమన్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతి ప్రదానం చేశారని వారు తెలిపారు.

'పరిశోధనలు దేశానికి వెన్నుముకలా నిలుస్తాయి'



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, మే 20: విభిన్న పరిశోధనలు దేశ అభ్యున్నతికి వెన్నుముకలా నిలుస్తాయని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. సంస్థలోని బయోటెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం ఆధీనం లోని సెర్బ్ సహకారంతో ప్రాసెస్ మోడలింగ్ సిమ్యులేషన్ అండ్ ఆప్టిమైజేషన్ ఇన్ బయోలాజికల్ సిస్టమ్స్ ఏ హాండ్స్ ఆన్ ట్రైనింగ్ అప్రోచ్ అనే అంశంపై వారం రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి మాట్లాడుతూ ఔషదాలు, బయో ఇంధనాలు, ఇతర బయోటెక్నాలజీ ఉత్పత్తుల నాణ్యత, దిగుబడులను పెంచేందుకు ఇటువంటి వర్క్‌షాప్‌లు ఎంతగానో దోహదపడతాయన్నారు. సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(చెన్నై)ఎన్విరాన్మెంటల్ సైన్స్ ల్యాబ్ హెడ్ అండ్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ పి.షణ్ముగం మాట్లాడుతూ తోళ్ల పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల వాటర్‌తో బయోగ్యాస్‌ని ఎలా తయారు చేయాలి, బయోగ్యాస్ ఉత్పత్తికి ఎటువంటి బయో రియాక్టర్లను వాడాలి తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బయో టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సుదర్శన దీప, కార్యక్రమ ఆర్గనైజర్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి, ఆచార్యులు డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ బాబూరావు, డాక్టర్ కార్తికేయశర్మ, డాక్టర్ యువరాజు, డాక్టర్ భరణిదరన్, డాక్టర్ సుభాని, డాక్టర్ తలారి రేష్మ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి మాజీ ఎంపీపీ నాగ సస్పెన్షన్

ఆకివీడు, మే 20: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కట్టా నాగను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పట్టణ అధ్యక్షుడు బొల్లం వెంకట్రావు, క్లస్టర్ ఇన్‌చార్జి గొంట్లా గణపతి, పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా సోమవారం తెలిపారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు.

పాలకొల్లులో కుక్కల స్వైర విహారం


గాయపడ్డ బాలుడు

పాలకొల్లు టౌన్, మే 20: పాలకొల్లు పట్టణంలోని 18, 21 వార్డుల్లో కుక్కలు స్వైర్య విహారం చేయడంతో ఆరుగురు చిన్నారులకు గాయాలయ్యాయి. సోమవారం స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలోని రాజీవ్ నగర్, గామాస్ కళ్యాణ మండపం ప్రాంతాల్లో ఉన్న కుక్కలు దాడి చేస్తు న్నాయి. వారం రోజులుగా నలుగురు పిల్లలపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయన్నారు. సోమవారం రాజీవ్ నగర్ ప్రాంతంలో రోడ్డుపై ఆడుకుంటున్న 12 సంవత్సరాలు బాలుడుపైనా, రెండేళ్ల చిన్నారిపైనా కుక్కలు దాడి చేసి కరవగా బాలుడుకి చేతికి తీవ్ర గాయమైంది. చిన్నారికి కాలుపై గాయమై నట్లు తెలిపారు. స్థానికులు హుటాహుటీన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకుని కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

రాజీవ్ కాలనీలో కార్డన్ సెర్చ్

పెనుమంట్ర, మే 20 : పెను మంట్ర రాజీవ్ కాలనీలో ఎస్సై రవీంద్రబాబు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్య ంలో కౌంటింగ్ జరిగే లోపు ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. స్థానికేతరులు ఎవరైనా నివాసం ఉంటు న్నారా? వివరాలు సేకరిం చారు. పెట్రోల్ బంకుల వద్ద బాటిల్స్‌లో పెట్రోల్ విక్రయించవద్దని విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం రాజకీయ పార్టీలు విధ్వంసాలకు పాల్పడతారని ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్‌సెర్చ్ నిర్వహించాలని ఆదేశించారు.

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని వార్ఫ్‌రోడ్డు, మండలంలోని కేఎస్ఎన్ కాలనీ ప్రాంతాల్లో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో సీఐ సుబ్రహ్మణ్యం తనిఖీలు నిర్వహించగా, మండలంలో కేఎస్ఎన్ కాలనీలో రికార్డులేని నాలుగు మోటారు సైకిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సురేష్ తెలిపారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

ఉండి, మే 20: మోటార్ సైక్లిస్టుకు గాయాలయ్యాయి. ఉండి పడవలరేవుకు చెందిన కెంగం ప్రవీణ్ ఈనెల 19వ తేదీన మోటార్‌సైకిల్‌పై ఉండి నుంచి గణపవరం వైపు వెళ్తుండగా వెలివర్రు అడ్డరోడ్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన మరో మోటార్‌సైకిలిస్ట్ ఢీకొన్నాడు. గణపవరం వెళ్లే వ్యక్తి చెవికి గాయాలైన్నట్లు దాంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నరసాపురంలో 86.97 శాతం పోలింగ్

నరసాపురం రూరల్, మే 20: నరసాపురం మండలంలోని మొత్తం 59826 మంది ఓటర్లు ఉండగా సార్వత్రిక ఎన్నికల్లో 52034 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం 86.97శాతం నమోదైంది. మొత్తం 65 బూత్‌ల్లో ఓటింగ్ నిర్వహించారు. ప్రతి బూత్ నుంచి 80శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. ఇక గ్రామాల వారిగా ఓటింగ్ సరళిని పరిశీలిస్తే.....

గ్రామం	బూత్	ఓటర్లు	పోలైనవి	శాతం
కే బేతపూడి	1	877	780	88.93
మల్లవరం	2	897	732	81.60
మల్లవరం 2	3	782	690	88.09
మల్లవరం	4	1132	905	79.94
సరిపల్లి	5	1107	898	80.00
సరిపల్లి	6	1051	860	81.00
సరిపల్లి	7	673	577	85.00
చిట్టవరం	8	1026	947	92.00
చిట్టవరం	9	888	751	84.57
చిట్టవరం	10	932	763	81.86
గొంది	11	976	860	88.20
పాత నవరసపురం	12	688	580	84.20
కొత్త నవరసపురం	13	781	641	82.45
రుస్తుంబాదా	57	870	691	72.00
రుస్తుంబాదా	58	1192	1041	87.21
రుస్తుంబాదా	55	592	488	84.69
రుస్తుంబాదా	56	1042	934	85.45
లిఖితపూడి	60	714	630	88.23
కొప్పర్రు	61	1005	796	79.00
కొప్పర్రు	62	771	701	80.00
కొప్పర్రు	63	826	665	75.00
కొప్పర్రు	64	993	906	90.92
సీతారాంపురం నార్త్	108	745	641	86.00
సీతారాంపురం నార్త్	109	694	620	89.00
రాజుగారితోట	110	590	487	82.20
సీతారాంపురం సౌత్	111	1183	1002	84.00
సీతారాంపురం సౌత్	112	1305	1061	81.30
సీతారాంపురం సౌత్	113	1206	1012	77.00
వైఎస్‌పాలెం	114	1061	930	87.69
వైఎస్‌పాలెం	115	976	858	87.00
లక్ష్మణేశ్వరం	116	1063	937	79.57
లక్ష్మణేశ్వరం	117	1177	1023	84.66
లక్ష్మణేశ్వరం	118	910	753	78.64
లక్ష్మణేశ్వరం	121	988	835	82.47
లక్ష్మణేశ్వరం	120	793	753	94.65
పెదలంక	122	1026	875	85.54
సారవ	123	966	900	93.16
సారవ	124	1096	951	86.77
ఎల్‌బిచర్ల	125	1039	913	87.00
ఎల్‌బిచర్ల	126	978	876	89.00
బైనపాలెం	127	1116	972	87.02
మోడీ	128	872	778	90.00
చామకూరిపాలెం	129	834	737	87.02
చామకూరిపాలెం	130	505	472	93.46
పసలదీవి	131	763	666	87.00
పసలదీవి	132	1060	976	92.00
పసలదీవి	133	1164	1098	94.00
తూర్పుతాళ్ళు	152	1128	1025	90.20
బద్దావారిపేట	153	1028	935	90.00
బద్దావారిపేట	154	1182	1080	91.00
పీఎంలంక	155	978	871	85.21
పీఎంలంక	156	1002	874	87.00
పీఎంలంక	157	1152	1030	89.00
ధర్బరేవు	158	726	640	84.21
ధర్బరేవు	159	731	647	83.10
మర్రితిప్ప	160	832	713	85.21
వేములదీవి వేస్ట్	161	672	587	85.00
వేములదీవి వేస్ట్	162	869	760	85.10
వేములదీవి వేస్ట్	163	539	491	86.00
వేములదీవి వేస్ట్	164	1138	1038	91.00
బియ్యపుతిప్ప	169	720	624	84.51
చినలంక	166	597	568	92.00
వేములదీవి ఈస్ట్	167	1039	872	83.20
వేములదీవి ఈస్ట్	168	925	754	78.25.
కాపులగొడప	165	643	568	88.44
	65	59826	52034	86.97

మేట్‌లు.. 'ఉపాధి'కి తూట్లు



అత్తిలి, మే 20 : గ్రామీణ పేద కుటుంబాలకు కనీసం వంద రోజులు పని కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశించినదే ఉపాధి హామీ పథకం. అయితే ఈ పథకం పెద్దలకు వరంగా మారింది. మేట్‌లు ఉపాధి పనులకు వెళ్ళకపోయినా దొంగ మస్తర్లు వేసి పని చేస్తున్నట్లు రూపొందిస్తున్నారని తెలుస్తోంది.

రాజకీయ మేట్

నిబంధనలు ప్రకారం ఉపాధి కూలీలు అంతా కలసి ఒకరిని మేట్‌గా ఎంపిక చేసుకుంటారు. వారి ఆధ్వర్యంలో పనులు జరుగుతుంటాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మేట్‌ల ఎంపిక అధికార పార్టీ కనుసన్నల్లో జరుగుతోంది. గ్రామాల్లో కూలీలను విడగొట్టి తమ వర్గానికి చెందిన మేట్‌కే పెత్తనం ఇస్తున్నారు. మేట్లు, క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్) ప్రింటెడ్ పేపర్లో మస్తర్లు వేస్తారు. ఆ తరువాత సాంకేతిక సహాయకుడు పనికి సంబంధించి కొలతలు వేసి ఎం-బుక్ రికార్డు చేసి ఉన్నతాధికారుల ఆమోద ముద్రతో బిల్లులు చెల్లిస్తారు. ఇక్కడ మేట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కుమ్మక్కవుతున్నట్టు తెలుస్తోంది. ఒక్కో మేట్ గ్రూపులో తనతో కలిపి 20 మంది సభ్యులు ఉండాలి. కానీ 60 నుంచి 150 వరకూ ఉంటున్నారు. గ్రామంలో లేని వ్యక్తుల పేర్లతో హాజరు సృష్టించి రోజూ పనికి హాజరవుతున్నట్లు మస్తర్లు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల మండలంలో పని చేయకపోయినా పనిచేస్తున్నారని మస్తర్లు వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనిపై దృష్టి పెడితే అసలైన కూలీలకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మజ్జిగ, మంచినీరు ఇవ్వరు..

ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి. మంచినీళ్ళతో పాటు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలి. ప్రాథమిక వైద్యానికి సంబంధించి మెడికల్ కిట్లను ఏర్పాటు చేయాలి. ఎక్కడా ఏర్పాట్లు లేవు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో కూడా వీటిని పట్టించుకోవడంలేదు. ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించకపోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

గొరగనమూడిలో కేంద్ర బృందం పర్యటన


గొరగనమూడిలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

పాలకోడేరు, మే 20:. గొరగనమూడి గ్రామ పంచాయతీలో మౌలిక వసతులపై కేంద్ర బృందం సభ్యులు సోమవారం సాయంత్రం పరిశీలించారు. టీమ్ సభ్యులు అభిషేక్ దీక్షిత్, అభిషేక్ గుప్తా, అప్రజిత్ రావత్, చంచల్ కుమారి, ఫాతిమా జైనాప్, కృష్ణకుమార్ జాంగిర్‌లు గ్రామాన్ని పరిశీలించారు. గ్రామంలో రైతులకు ఉపయోగపడే ఆర్‌బీకే కేంద్రం ఉందా, విద్యార్థులు చదువుకునేందుకు పాఠశాలలు ఏ విధంగా ఉన్నాయి, అదే విధంగా గ్రామంలో వైద్య కేంద్రాలున్నాయా, తాగునీరు వ్యవస్థ, డ్రెయినేజీ సౌకర్యం ఉన్నాయా తదితర అంశాలు వారు పరిశీలించారు. గ్రామంలో అన్ని వసతులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసినందుకు గానూ సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజును వారు అభినందించారు. అనంతరం రైతులతో ముఖాముఖి అయ్యి వ్యవసాయాన్ని మెరుగుపరిచేందుకు ఎటువంటి పద్ధతులు పాటిస్తున్నారు. ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందుతున్నాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్, ఈవోపీఆర్‌డీ ఎంఎస్ఆర్ ఆంజనేయులు, పంచాయతీ సెక్రటరీ లక్ష్మి, వీఆర్వో శ్రీను పాల్గొన్నారు.

చెరువు తవ్వకాలు నిలిపివేత

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మొగల్తూరు, మే 20: వ్యవసాయ భూములు అనుమతి లేకుండా చేపల చెరువులు తవ్వుతూ మట్టిని లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్నారంటూ 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించారు. సోమవారం ఆప్రాంత వీఆర్వో నవుడూరు గరువులో తవ్వుతున్న చెరువులను సందర్శించి ఎర్రజెండాలు పాతి ఈ పొలాల్లో చేపల చెరువులు తవ్వేందుకు అనుమతి లేదంటూ తహసీల్దార్ హెచ్చరిక తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీఆర్వో వెంకట లక్ష్మి, వీఆర్ఏ వేగి శ్రీనులు చెరువులు తవ్వే ప్రాంతంలో ఏర్పాటు చేశారు.


చెరువు తవ్వకాల వద్ద ఫ్లెక్సీ, ఎర్రజెండాలు పెట్టిన వీఆర్వో వెంకట లక్ష్మి


రిలే దీక్షలు చేస్తున్న కార్మికులు

తక్షణమే వేతన ఒప్పందం చేయాలి

పెంటపాడు, మే 20: 3-ఎఫ్ ఇండస్ట్రీస్ యాజమాన్యం కార్మికులకు వేతన ఒప్పందం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. ఈ మేరకు కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఒప్పందం పూర్తయి 14 నెలలు అవడంతో యాజమాన్యంతోనూ, ఏలూరు కార్మికశాఖాధికారులతో కూడా పలుమార్లు చర్చలు జరిగాయన్నారు. యాజమాన్యం తక్షణం స్పందించి వేతన ఒప్పందం చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిరపరపు రంగారావు, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, 3ఎఫ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టి.గణేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు ఉచిత శిక్షణ

భీమవరం ఎడ్యుకేషన్, మే 20 : ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ఉత్తీర్ణులై ఉండి మెయిన్ పరీక్షలకు హాజరయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ అభ్యర్థులకు ఈనెల 25 నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పశ్చిమ గోదావరి జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి జీవీఆర్‌కెఎస్ఎస్ గణపతిరావు తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల వెనుక జయకృష్ణాపురం గణేష్‌నగర్లో ఉన్న వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రంలో ఈ శిక్షణ ఇస్తారని వివరించారు. శిక్షణతో పాటు ప్రతీ సబ్జెక్టుకు ప్రాక్టీస్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారన్నారు. లైబ్రరీ, స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపికైన వారికి స్టైఫండ్, బుక్స్ అలవెన్స్ వంటి సౌకర్యాలు కూడా ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు డైరెక్టర్, ఏపీ బీసీ స్టడీ సర్కిల్, ఆర్ట్స్ కాలేజీ వద్ద, రాజమహేంద్రవరం చిరునామాకు దరకాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 0883-2421129, 9393934225, 8639447339 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని గణపతిరావు సూచించారు.

తీరంలో భానుడి భగభగ



నరసాపురం టౌన్, మే 20: తీర ప్రాంతంతో సోమవారం భానుడు భగభగమన్నాడు. ఉదయం 8గంటలకే ఎండ రావడంతో చాలా మంది పనులు ముగించుకుని 11గంటలకే ఇంటి పరిమితమయ్యారు. మధ్యాహ్నం ఎండ వేడిమితో పాటు వడగాల్పులు వీయడంతో బయటకు వచ్చేందుకు జనం సాహసించలేదు. అత్యవసరం అయితే గొడుగులు, టోపీలు పెట్టుకుని రావాల్సిన పరిస్థితి. మరోవైపు జనసంచారం లేకపోవడంతో మెయిన్‌రోడ్, స్టీమర్‌రోడ్, సీతారాంపురం హైవేలు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. సాయంత్రం 5 దాటిన తరువాతే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు.

నరసింహమూర్తి ఆశయ సాధనకు కృషి చేయాలి

ఆచంట, మే 20: వల్లూరు మాజీ సర్పంచ్ వల్లూరి నరసింహమూర్తి ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. నరసింహమూర్తి 108వ జయంతి సందర్భంగా సోమవారం వల్లూరులో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వల్లూరు గ్రామానికి మొదటి సర్పంచ్‌గా నరసింహమూర్తి సుదీర్ఘ కాలం పని చేశారన్నారు.

పంటల దిగుబడికి తేనెటీగలు దోహదం


మాట్లాడుతున్న ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.మల్లిఖార్జునరావు

ఉండి, మే 20: పంటల దిగుబడిని పెంచడంలో తేనెటీగల ప్రాముఖ్యతను మరువరాదని ఉండి కేవీకే ప్రొగ్రాం కోఆర్డినేటర్ డా.మల్లిఖార్జునరావు అన్నారు. సోమవారం కృషివిజ్ఞాన కేంద్రంలో ప్రపంచ తేనెటీగల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లిఖార్జునరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. పంటలలో పురుగుమందుల వాడకం వలన తేనెటీగలు నశించిపోవడం జరుగుతుందన్నారు. పంటల దిగుబడి పెంచడానికి తేనెటీగలను రక్షించుకోవలసిన అవసరం వుందన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు డా.డిబోరా మెషియానా, డా.ఎశ్రీనివాసరావు, డా.వి.విజయలక్ష్మి, బి.రజిత పాల్గొన్నారు.

బంగారం, వెండి వస్తువుల చోరీ

ఉండి, మే 20: ఇంటివారంతా శ్రీశైలం వెళ్లిన సమయం చూసుకుని గుర్తు తెలియని వారు ఆ ఇంట్లోకి ప్రవేశించి చోరికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఉండి గ్రామానికి చెందిన మండ కురేశ్వరరావు మూడవ కుమారుడు చిరంజీవిరావు ఈనెల 19న కుటుంబంతో సహా శ్రీశైలం వెళ్లాడు. అదేరోజు అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి వస్తువులను అపహరించుకుని పోయారని బాధితుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


మాజీ ఎమ్మెల్యే అంజిబాబును కలిసిన మాజీ కౌన్సిలర్ చెన్ను చంటి,శాంతి

కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటా

భీమవరం టౌన్, మే 20: కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని జనసేన కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) భరోసా ఇచ్చారు. ఇటీవలే వీరవాసరం జనసేన జడ్పీటీసీ గుండా జయప్రకాష్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి చేరిన వైసీపీ మాజీ కౌన్సిలర్ చెన్ను శాంతి, చంటిలను సోమవారం మాజీ ఎమ్మెల్యే అంజిబాబును కలిశారు. పార్టీలో చేరినందుకు అభినందనలు తెలిపారు. వచ్చేనెల 4న జరిగే కౌంటింగ్‌లో భీమవరం నుంచి కూటమి విజయం తథ్యమని, అత్యధిక మెజార్టీ సాదిస్తున్నామని అన్నారు.

- పట్టణంలోని 37వ వార్డులోని మహిళలు అంజిబాబును కలసి సమస్యలను తెలియజేశారు. మీ ఆదరణ ఎప్పటికి మరువలేనని, ప్రతిఒక్కరికి రుణపడి ఉంటానని అన్నారు. పట్టణ మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు చల్లా రాము, చరణ్, విజ్జురోతి రాఘవులు పాల్గొన్నారు.


యాగంలో పూజలు చేయించుకుంటున్న కమిషనర్ శ్యామల

దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతకు చోటు ఇవ్వాలి

భీమవరం టౌన్, మే 20 : ఆధ్యాత్మిక చింతన లేని జీవితం వ్యర్థమని, దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతకు కొద్దిగా చోటు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న అతిరాత్ర మహా యాగంలో భాగంగా ఆరో రోజు ఆమె పాల్గొని పూజలు చేయించుకున్నారు. మున్సిపల్ కమిషనర్ శ్యామల మాట్లాడుతూ అతిరాత్ర మహాయాగం దర్శనం తరువాత నాలో ఒక ఆధ్యాత్మిక అనుభూతి కలిగిందన్నారు. రెండో పట్టణ సీఐ జి.శ్రీనివాస్, ప్రముఖ వైద్యులు చీడే సత్య నారాయణ, గాదిరాజు సుబ్బరాజు, ఎస్ఆర్ కేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవి మురళీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తిదాయకం

గణపవరం, మే 20 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు స్ఫూర్తిదాయకమని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు అన్నారు. ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా గణపవరంలో సోమవారం వివేకానంద సేవా సమితి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అలాగే ప్రకాశం పంతులు జ్ఞాపకార్థం 1972లో ప్రకాశం జిల్లాగా మార్చరని అన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పంట కాల్వలు ప్రక్షాళన చేయాలని కలెక్టర్‌కు వినతి


కాళ్లలోని అన్నయ్యకోడును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివరామరాజు

ఉండి, కాళ్ల, మే 20: ఉండి నియోజకవర్గంలోని పంట కాలువలు ప్రక్షాళన చేయాలని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు కోరారు. సోమవారం ఉండి, కాళ్ల, ఆకివీడు మండలాల్లోని పంట కాలువలను పరిశీలించారు. కాల్వల్లో గుర్రపుడెక్క, కిక్కిస పేరుకుపోవడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. తాను 10 ఏళ్ల ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో పంటకాలువలు, మురుగుడ్రెయిన్లు ఎంతో పరిశుభ్రంగా వుండేవని ఆయన గుర్తుచేశారు. వేసవి అనంతరం కాలువలకు జూన్ 10వ తేదీకి నీటిని విడిపెడతారని ఈలోపలే పంటకాలువలను, పంటబోదెలలో పేరుకున్న గుర్రపుడెక్క తొలగించాలని కలెక్టరును కలిసి కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గేదెల జాన్, మాజీ సర్పంచ్ ముదుండి ఫణిబాబు, నంబూరి త్రిమూర్తులురాజు, వక్కపట్ల వంశీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

మానవత సమావేశానికి కలెక్టర్‌కు ఆహ్వానం

పెనుమంట్ర, మే 20 : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ పెనుమంట్ర శాఖ మార్టేరులో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌ని ఆహ్వానించడానికి భీమవరంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను మానవతా కమిటీ సభ్యులు కలిశారు. ఈ నెలాఖరున జరిగే మానవత రాష్ట్ర శిక్షణ శిబిరం ముగింపు సమావేశానికి రావాలని కోరారు. మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, కార్యదర్శి బండి ప్రసాద్ పాల్గొన్నారు.

అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు



పాలకొల్లు అర్బన్, మే 20: శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ మేనేజర్ పీటీ గోవిందరావు తెలిపారు. 29వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రోజు ప్రత్యేక పూజలు, వివిధ రకాల వాహనాలపై గ్రామోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

కనక దుర్గమ్మకు వెండి అందజేత

పాలకొల్లు అర్బన్, మే 20 : యడ్ల బజారులోని శ్రీ కనక దుర్గమ్మకు సోమవారం భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలు జరిపించుకున్నారు. పట్టణానికి చెందిన నెక్కంటి ఆదినారాయణ, సత్యవతి, కుటుంబ సభ్యులు అమ్మవారి మకరతోరణం తయారి నిమిత్తం 5 కిలోల వెండిని అందించారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.1,13,996

కనక దుర్గమ్మ ఆలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు సమక్షంలో 2 నెలల 6 రోజులకు గానూ హుండీల ద్వారా రూ.1,13,996 వచ్చినట్టు ఈవో ఎన్.సతీష్ కుమార్ తెలిపారు.

శంభేశ్వర స్వామికి అన్నాభిషేకం



పాలకొల్లు అర్బన్, మే 20 : స్థానిక 25వ వార్డులోని శ్రీ రత్నమాంబ సమేత శంభేశ్వర స్వామికి సోమవారం సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. వైశాఖ శుద్ధ త్రయోదశి పురస్కరించుకుని ఉదయం నుంచి అభిషేకాలు సాయంత్రం అన్నాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

కన్నుల పండువగా అగస్త్యేశ్వరస్వామి కల్యాణం



పోడూరు, మే 20: పెనుమదం శ్రీఉమా అగస్త్యే శ్వరస్వామి-ఉమాబాల త్రిపుర సుందరీదేవి కల్యా ణం కన్నుల పండువగా జరిగింది. ఈవో పిల్లి సూర్య నారాయణ స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి కల్యా ణోత్సవం సందర్భంగా ఐదు రోజుల పాటు ఆలయ ప్రాం గణంలో వివిధ ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈనెల 22న ఆలయప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శ్రీవారికి అష్టోత్తర కలశాభిషేకం



భీమవరం టౌన్, మే 20: పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు సాంప్రదాయ బద్దంగా వేద మంత్రాలతో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం పంచామృతాలతోను అష్టోత్తర (108) కలశాభిషేకం నిర్వహించారు. 21న 108 తులసి మొక్కలతో తులసి బృందార్చన, అష్టదళ పాద పద్మారాధన, సాయంత్రం స్వామివారికి పట్టువస్త్రాలు అందజేత, 22న పద్మావతి అమ్మవారికి సామూహికంగా లక్ష కుంకుమార్చన, సాయంత్రం రథోత్సవం, పుష్పయాగోత్సవం, 23న పూర్ణాహుతి, 25న అఖండ అన్న సమారాధన నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో గంగా శ్రీదేవి తెలిపారు.

శ్రీవారికి పుష్పార్చన, గ్రామోత్సవం



కాళ్ల(ఉండి), మే 20: కాళ్ళకూరు శ్రీవారి తిరు కల్యాణ మహోత్సవాలలో భాగంగా సోమవారం పుష్పార్చన, గ్రామోత్సవాలను నిర్వహించారు. ఆలయ ఈవో ఎ.అరుణకుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు



ఉండి, మే 20: శ్రీచెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామి వారి ఆలయంలో మేళతాళాలతో తీర్థబిందె, తిరుమంజనసేవ, అలంకరణసేవ, విశేషపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి గరుడవాహన సేవ కార్యక్రమం నిర్వహించారు.

జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు

పాలకొల్లు అర్బన్, మే 20 : సినీ హీరో జూనియర్ ఎన్టీర్ పుట్టిన రోజు సందర్భంగా నందమూరి అభిమానులు సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ పేరుతో శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆపద్బంధు బ్లడ్ బ్యాంక్‌లో అభిమానులు రక్తదానం చేశారు. ఎన్టీఆర్ సింహాద్రి ట్రస్టు ద్వారా 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన నిరు పేద విద్యార్థి షేక్ ఇస్మాయిల్‌కి రూ.25వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు షేక్ సిలార్, ప్రధాన కార్యదర్శి గుడాల ప్రసాద్, కోశాధికారి పాశర్ల మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: సినీహీరో జూనియన్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకల్ని పట్టణ, మండలంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. అనంతరం బస్టాండ్ సమీపంలో చిన్న కనకదుర్గా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. పట్టణంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

బాధితుడికి జూనియర్ ఎన్టీఆర్ సాయం


లక్ష రూపాయల నమూనా చెక్కును అందజేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్

ఆకివీడు, మే 20: జూనియర్ ఎన్టీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక పెద్దపల్లి వీధికి చెందిన షేక్ రఫీకి జూనియర్ ఎన్టీఆర్ సింహాద్రి ట్రస్టు ద్వారా రూ.1లక్ష చెక్కును ఫ్యాన్స్ మండలాధ్యక్షుడు మీగడ నాగరాజు నేతృత్వంలో సోమవారం అందజేశారు. రఫీకి 2019 జూలైలో ఇంటి పైనుంచి పడిపోవడంతో వెన్నుపూస దెబ్బతిని మంచానికే పరిమితమయ్యాడు. రఫీ సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో తాము జూనియర్ ఎన్టీఆర్ దృష్టికి తీ సుకెళ్ళడంతో ఆయన చెక్కును అందచేశారన్నారు. టస్టు రాష్ట్ర కన్వీనర్లు దాపర్తి నాగు, శవాకుల శ్రీను, ఫ్యాన్స్ మండల కార్యదర్శి మద్దా నరేష్, టి.ఈశ్వరకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ


మేడపాడులో రోడ్డు ప్రమాదం దృశ్యం.. లారీ కింద మోపెడ్

యలమంచిలి, మే 20: బూరుగుపల్లి గ్రామంలోని మట్టవానిచెరువు ప్రాంతానికి చెందిన దంపతులు బండి రమేష్, సత్యవాణిలు మోపెడ్‌పై శిరగాలపల్లి నుంచి యలమంచిలి వెళుతుండగా మేడపాడు వద్ద టర్నింగ్ తిరుగుతున్నారు. మేడపాడు సెంటరు నుంచి యలమంచిలి వైపు మట్టిలోడుతో వెళుతున్న లారీ అదే టర్నింగ్ ప్రాంతానికి రావడం.. మలుపు తిరిగి ప్రధాన రహదారిపైకి వచ్చిన మోపెడ్‌ను తప్పించబోయిన లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. మోపెడ్‌పై వెళుతున్న భార్యభర్తలు, మోపెడ్‌తో సహా లారీ కిందకు వెళ్లిపోయారు. ఈ ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని పాలకొల్లులోని ఆసుపత్రికి తరలించి.. మెరుగైన చికిత్స కోసం రాజమండ్రి తరలించారు.